ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 286

పేజీలు : 5 వెల రూ. 2/-

గురువారం
12 ఫిబ్రవరి 2026

PUBLISHED FROM :
HYDERABAD



AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com


## బ్రిటిష్ పార్లమెంట్‌లో తెలంగాణ బిడ్డ

### హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో జీవితకాల సభ్యుడిగా ఉదయ్ నాగరాజు ప్రమాణ స్వీకారం




2 లో

# పట్టణాల్లో ఎక్కువ.. నగరాల్లో తక్కువ

- పురపాలికల్లో 75.88%... నగరపాలికల్లో 66.05% మొత్తంగా 73% పోలింగ్
- ఓటేసిన వారిలో మహిళలే అధికం - రేపు ఓట్ల లెక్కింపు
- కార్పొరేషన్లలో అత్యధికంగా నల్గొండలో 77.36%.. అత్యల్పంగా నిజామాబాద్‌లో 59.12%
- మున్సిపాలిటీల్లో చౌటుప్పల్‌లో 91.91%, నందికొండలో 59.68% నమోదు
- చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతం




2 లో

## మెట్రోపాలిటన్‌లో అందరికీ సమాన పౌరసేవలు

### ఇందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తాం

### నేడు మూడు కార్పొరేషన్ల తొలి స్థాయీ సంఘ సమావేశం

హైదరాబాద్: "జీహెచ్‌ఎంసీ విస్తరణతో శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అంతర్భాగమయ్యాయి. విలీనమైన ఆయా ప్రాంతాల్లోని వారికి కూడా నగరంలోని ప్రజలకు అందుతున్నట్లుగా సేవలు అందేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేస్తాం. మెట్రోపాలిటన్ ప్రాంత ప్రజలందరికీ సమాన పౌరసేవలు, మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యం. శివారు మున్సిపాలిటీల సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇచ్చి, మెరుగైన ప్రణాళిక అందించి అమలుచేస్తాం" అని మెట్రోపాలిటన్ ఏరియా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రాజధానిలోని మూడు కార్పొరేషన్ల ప్రత్యేక అధికారి జయేశ్‌రంజన్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ పునర్విభజనలో భాగంగా ఏర్పాటైన జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల మధ్య సమగ్ర మొబిలిటీ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. వాటి పరిధిలోని కీలకమైన అంశాలపై గురువారం తొలి స్థాయీ సంఘ సమావేశం జరుగుతుందని, ఈ సమావేశంలో కొన్ని నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.

బుధవారం ఈ కార్పొరేషన్ల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. కొత్త కార్పొరేషన్లకు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు వాటిని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. వాటికి కొత్త పాలక మండలి ఏర్పాటయ్యేందుకు సమయం పడుతుందన్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో పలు సంస్కరణలతో పరిపాలన, మౌలిక సదుపాయాల్లో కీలకమైన మార్పులు తీసుకువస్తామని మిగతా 2లో..



# ఓటమి భయంతోనే కాంగ్రెస్ దౌర్జన్యకాండ

- పోరాడినశ్రేణులకు ధన్యవాదాలు
- వారి పోరాట స్ఫూర్తి కొండంత బలం
- రేవంత్ మూల్యం చెల్లించుకోవాల్సిందే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..

హైదరాబాద్, ఫిబ్రవరి 11 :

మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే అధికార కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యకాండకు, అధికార దుర్వినియోగానికి పాల్పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. పంచాయతీ ఎన్నికల్లో ఎదురైన పరాభవం పట్టణాల్లోనూ తప్పదని గ్రహించే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కనుసన్నల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. అధికారపక్షం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ప్రలోభాలకు గురిచేసినా వెన్నుచూపకుండా మొక్కవోని దీక్షతో వీరోచితంగా పోరాడిన గులాబీ సైనికులకు పేరుపేరునా ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలియజేశారు.

రెండేండ్లలో ఘోరమైన పాలనా వైఫల్యాలను మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పురపాలక ఎన్నికల్లో అక్రమాలపర్వానికి తెరలేపారని ఆరోపించారు. అక్రమంగా లూటీ చేసిన ప్రజాధనంతో ప్రజాతీర్పును మార్చే కుట్రలకు తెగబడ్డారని విమర్శించారు. పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ శ్రేణులు, అభ్యర్థులపై దాడులకు ఉసిగొల్పారని మండిపడ్డారు. కానీ, కాంగ్రెస్ అరాచకాలు, దుర్మార్గాలు, దాడులను విజయవంతంగా తిప్పికొట్టి అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు బీఆర్ఎస్ శ్రేణులు వీరోచిత పోరాటం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

వారి మొక్కవోని దీక్ష, కంకణబద్ధమైన కృషి పార్టీకి కొండంత బలం, ఆత్మవిశ్వాసం నింపిందని కొనియాడారు. పోలీసులను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ శ్రేణులపై వేధింపులు, దాడులకు దిగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. ప్రజలకిచ్చిన హామీలు, పాలనను పూర్తిగా గాలికొదిలి, రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన పాపం ముఖ్యమంత్రిని ప్రతినిత్యం వెంటాడుతూనే ఉంటుందని మిగతా 2లో..



# పట్టణాల్లో ఎక్కువ.. నగరాల్లో తక్కువ

**- యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఆరో వార్డు బహద్దూరుపేటలో బారులు తీరిన మహిళా ఓటర్లు**

హైదరాబాద్: రాష్ట్రంలో పుర ఎన్నికలు ముగిశాయి. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎక్కడా రీపోలింగ్ అవసరం లేదని ఎన్నికల సంఘం వెల్లడించింది. బుధవారం రాష్ట్రంలో జరిగిన పుర ఎన్నికల్లో దాదాపు 73.01 శాతం పోలింగ్ నమోదైంది. 2020 మున్సిపల్ ఎన్నికల్లో ఇది 74.40శాతం. శుక్రవారం 138 కేంద్రాల్లో ఓట్లు లెక్కించనున్నారు. 16న కార్పొరేషన్ల మేయర్లు, ఉపమేయర్లు, మున్సిపాలిటీల ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్ల పదవులకు పరోక్ష ఎన్నికలు జరగనున్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా ఏడు నగరపాలక సంస్థల్లోని 412 డివిజన్లు, 116 పురపాలక సంఘాల్లోని 2,569 వార్డుల్లో ఎన్నికలు జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పలు చోట్ల బారులుదీరారు.

మొత్తం 52,17,413 మందిలో 38,09,406 మంది ఓటేశారు. పురపాలికల్లో 75.88 శాతం, నగరపాలక సంస్థల్లో 66.05 శాతం మంది ఓటేశారు. అత్యధికంగా 26,67,025 మంది మహిళలల్లో 19,57,226 మంది (73.39శాతం).. 25,49,750 మంది పురుషుల్లో 18,51,829 (72.63 శాతం) మంది.. 638 మంది ఇతరుల్లో 351 మంది (55.02 శాతం) ఓటింగ్‌లో పాల్గొన్నారు.

నగరపాలక సంస్థల్లో అత్యధికంగా నల్గొండలో 77.36 శాతం పోలింగ్ జరగ్గా...అత్యల్పంగా నిజామాబాద్‌లో 59.12 శాతం మంది ఓటేశారు. మొత్తం 2,184 పోలింగ్ కేంద్రాల్లో 10,05,119 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 5,14,475 మంది మహిళలు, పురుషులు 4,90,544 మంది, ఇతరులు 100 మంది ఓట్లు వేశారు.

మొత్తం 116 పురపాలికల్లో 2,569 వార్డుల్లో 28,04,274 ఓట్లు పోలయ్యాయి. మహిళలు 14,42,751 మంది కాగా.. పురుషులు 13,61,285 మంది. ఇతరులవి 238 ఓట్లు ఉన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో 91.91 శాతం.. చండూరులో 91.52 శాతం, సంగారెడ్డి జిల్లా జిన్నారంలో 90.98 శాతం, భువనగిరిలో 90.95 శాతం మేరకు పోలింగ్ జరిగింది. అత్యల్పంగా నల్గొండ జిల్లాలోని నందికొండలో 59.68 శాతం మంది మాత్రమే ఓటేశారు. ఎన్నికల సందర్భంగా పలు చోట్ల స్వల్ప ఘర్షణలు, వాగ్వాదాలు జరిగాయి.



## నేరస్థులను నడిపించుకుంటూ స్టేషన్‌కు

హత్యకేసులో నిందితులకు వినూతన్న శిక్ష

**బాపట్ల,ఫిబ్రవరి**

యువతలో నేర ప్రవృత్తి బాగా పెరుగుతోంది. దీనిని కట్టడి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసులు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నారు. నేరానికి పాల్పడిన నిందితులను కిలోమీటర్ల మేర పట్టపగలు నడి రోడ్డుపై నడిపించి.. పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళ్తున్నారు. ఈ తరహా ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల చీరాలలో యువకుడి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ హత్యకు పాల్పడిన నిందితులకు పోలీసులు ఈ తరహా పద్ధతినే అమలు చేశారు. నేరాలకు పాల్పడే వారికి ఈ తరహా చర్యలు తప్పవంటూ నేర ప్రవృత్తి ఉన్నవారికి చెప్పకనే చెప్పారు పోలీసులు. జనవరి 27న చీరాల ఫ్లై ఓవర్ వద్ద కొండే త్రినాథ్ (19) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. అతడిని బీరు బాటిల్స్‌తో దారుణంగా పొడిచి.. బండరాయితో తలపై మోది హత్య చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా చీరాల ప్రాంతాల్లోని పలు సీసీ కెమెరాలను పోలీసులు జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తమదైన శైలిలో వారిని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నారు. ఓ యవతితో ప్రేమ వ్యవహారంలో త్రినాథ్‌ను షేక్ గౌస్ హత్య చేశాడు. అతడికి దేవ హర్ష, శీలం భగవంతుడు సహాయం చేసినట్లు అంగీకరించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు కోర్టు 14 రోజులపాటు రిమాండ్ విధించింది. బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన కొండె వెంకటేశ్వర్లు, రాజేశ్వరి దంపతులకు రెండో కుమారుడు త్రినాథ్ (19). అతడు తన అన్నతో కలిసి చీరాలలోని నానామ్మ ఇంటి వద్ద ఉంటూ.. రోజు వారీ విద్యుత్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. త్రినాథ్, ఓ యువతి ప్రేమించుకుంటున్నారు. ఆ యువతిని త్రినాథ్ స్నేహితుడు షేక్ గౌస్ సైతం ప్రేమిస్తున్నాడు. దాంతో త్రినాథ్‌పై షేక్ గౌస్ కక్ష పెంచుకున్నాడు. దాంతో స్నేహితుల సహాయంతో త్రినాథ్‌ను గౌస్ దారుణంగా హత్య చేశాడని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది.

## ఎపిలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయండి

సిఎం చంద్రబాబును కోరిన కూతరు వెన్నెల

అమరావతి,ఫిబ్రవరి

ప్రముఖ విప్లవ గాయకుడు, కవి గద్దర్ కుమార్తె వెన్నెల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిశారు. ఈ సందర్భంగా ఆమె సీఎంకు వినతిపత్రం సమర్పిస్తూ, ఏపీలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే ఆంధ్రా యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ కల్చరల్ విభాగానికి గద్దర్ పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వెన్నెల, తెలుగు సాంస్కృతిక రంగానికి, ప్రజా ఉద్యమాలకు గద్దర్ చేసిన విశేష సేవలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె విజ్ఞప్తులపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు. తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ, గద్దర్ సేవలను గౌరవించేలా సానుకూల నిర్ణయం వెలువడుతుందన్న నమ్మకం తమకు ఉందని చెప్పారు.

## వేగవంతంగా జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే

అధికారులకు నెల్లూరు కలెక్టర్ దిశానిర్దేశం

నెల్లూరు,ఫిబ్రవరి

జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. బుధవారం ఎంపిడివోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు.నిర్దేశిరచిన లక్ష్యాల మేరకు సమగ్ర కుటుంబ సర్వేను ప్రతిరోజూ నిర్వహించాలని, ఈ అంశంపై ఎంపిడివోలు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. వాలిడేషన్ సమయంలో మళ్లీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కుటుంబ సభ్యుల వివరాల మ్యాపింగ్‌ను క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తిస్థాయిలో, పొరపాట్లు లేకుండా చేయాలని ఆదేశించారు. అలాగే వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ-క్రాప్ నమోదును సకాలంలో పూర్తిచేయాలని తెలిపారు. వన్ విలేజ్ ? ఫోర్ విజిట్స్ కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.ప్రభుత్వం చేపడుతున్న అన్ని కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా, ప్రత్యేక శ్రద్ధతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.

## స్కూళ్లు, హాస్టళ్లలో సురక్షిత మంచినీరు

ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు సిఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి,ఫిబ్రవరి

రూ.60 కోట్ల సాస్కి నిధులతో రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. బుధవారం నాడు రాజధాని అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి కీలక ఆదేశాలు జారీ చేశారు ముఖ్యమంత్రి. రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్ల నిర్మాణంతోపాటు సురక్షిత తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసే అంశంపై అధికారులకు దిశానిర్దేశర చేశారు.÷ూస్టళ్లలో శానిటేషన్, ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను సీఎం ఆదేశించారు. హెల్త్, ఎడ్యుకేషన్ సహా అన్ని రంగాల్లోనూ బెస్ట్ ప్రాక్టీసెస్ అనుసరించాలని వారికి చంద్రబాబు స్పష్టం చేశారు. విద్యార్థుల విద్యాపరమైన అంశాల పర్యవేక్షణకు అపార్ ఐడీలను నమోదు చేసి లింక్ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కాగా, 814 హాస్టళ్లలో రూ.17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ఎ÷-లాంట్లను ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబుకు ఉన్నతాధికారులు వివరించారు. ఈ సమీక్షలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఫోన్ బ్లాక్ చేయడంపై ఆగ్రహం

ప్రియుడిని కిరాతకంగా చంపిన ప్రియురాలు

రాయపూర్,ఫిబ్రవరి

ప్రియుడు తన ఫోన్ నెంబర్ బ్లాక్ చేశాడన్న కోపంతో ఓ యువతి దారుణానికి ఒడిగట్టింది. ప్రియుడిని అతి కిరాతకంగా కత్తితో పొడిచి చంపేసింది. ఈ సంఘటన ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బిలాస్‌పూర్‌కు చెందిన 25 ఏళ్ల కమ్తా ప్రసాద్ సూర్య వంశీ హోటల్‌లో సర్వర్‌గా పని చేస్తున్నాడు. తన స్నేహితులతో కలిసి హోటల్‌కు దగ్గరలో ఇళ్లు అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆరు నెలల క్రితం అతడికి ఇన్‌స్టాగ్రామ్‌లో 22 ఏళ్ల రోషిణి సూర్యవంశీతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారింది. కలిసి తిరిగే వారు.. ఫోన్‌లో గంటలు, గంటలు మాట్లాడుకునే వారు. అయితే, గత మూడు రోజుల నుంచి ప్రసాద్ వింతగా ప్రవర్తించటం మొదలెట్టాడు. రోషిణి ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేశాడు. దీంతో రోషిణి తీవ్ర ఆగ్రహానికి గురైంది. అతడు వేరే అమ్మాయితో తిరుగుతున్నాడేమోనన్న అనుమానం వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం కత్తి తీసుకుని ప్రసాద్ ఉండే ఇంటి దగ్గరకు వెళ్లింది. ప్రసాద్ తలుపు తెరవగానే అతడి మొబైల్ ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేసింది. అతడు ఇందుకు ఒప్పుకోలేదు. ఇద్దరి మధ్యా గొడవ మొదలైంది. కట్టలు తెంచుకున్న కోపంతో రోషిణి ప్రసాద్‌పై కత్తితో దాడి చేసింది. నేరుగా అతడి గుండెపై పొడిచింది. ప్రసాద్ గట్టిగా అరవటంతో లోపల ఉన్న ఫ్రెండ్ బయటకు వచ్చాడు. ప్రసాద్ నేలపై రక్తపు మడుగులో పడిపోయి ఉన్నాడు. ఆ ఫ్రెండ్ వెంటనే ప్రసాద్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రసాద్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు చనిపోయినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.నిందితురాలు రోషిణిని అరెస్ట్ చేశారు. పోలీస్ అధికారి మాట్లాడుతూ.. 'ఆ యువతి మృతుడి ఇంటికి వచ్చింది. అతడి ఫోన్ ఇవ్వమని డిమాండ్ చేసింది. గొడవ సందర్భంగా కత్తితో అతడి గుండెపై పొడిచింది.

## బిజెపి అభ్యర్థులకు బూస్ట్

**ప్రచారం చేయనున్న పవన్ కళ్యాణ్**

**హైదరాబాద్,ఫిబ్రవరి:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరలో తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈనెల 7,8 తేదీల్లో బీజేపీకి మద్దతుగా పవన్ ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు బిజెపి నేతలకు హామీ ఇచ్చారు. మంగళవారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు రామచందర్‌రావు.. పవన్ కళ్యాణ్‌ను కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మున్సిపల్ ఎన్నికలు సహా పలు కీలక అంశాలపై ముగ్గురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా బీజేపీ తరఫున ప్రచారంలో పాల్గొనాలని కిషన్ రెడ్డి, రామచందర్ రావు.. పవన్‌ను కోరారు. ఇందుకు పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని రామచందర్ రావు స్వయంగా వెల్లడించారు. మంగళవారం ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పవన్ కళ్యాణ్ గారిని కలవడం గౌరవంగా భావిస్తున్నా. తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలతో సహా ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా, అర్థవంతమైన చర్చలు జరిపాము. పవన్ కళ్యాణ్ గారు భారతీయ జనతా పార్టీకి పూర్తి మద్దతు ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రచారం చేయడానికి అంగీకరించారు' అని తెలిపారు. కాగా, రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 11న ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత 13న ఫలితాలను వెల్లడించనున్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 ప్రకారం ఈ ఎన్నికల పక్రియ కొనసాగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసి పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. బీజేపీ, జనసేన స్నేహపూర్వక పోటీ అంటూ ఈ మేరకు జనసేన పార్టీ ట్వీట్ చేసింది.

## మరణశాసనం రాసిన కొరియన్ గేమ్

ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలై ఆత్మహత్య

యూపిలో ముగ్గురు అక్కాచెల్లెళ్ల బలవన్మరణం

లక్నో,ఫిబ్రవరి

ఉత్తర ప్రదేశ్‌లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఆన్‌లైన్ కొరియన్ గేమ్ ముగ్గురు అక్కాచెల్లెళ్ల ప్రాణం తీసింది. ఆన్‌లైన్ గేమ్ ఆడవద్దని తల్లిదండ్రులు మందలించటంతో ముగ్గురు అక్కాచెల్లెళ్లు 9వ అంతస్తు నుంచి కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి 2.30 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఘజియాబాద్‌కు చెందిన 16 ఏళ్ల నిషిక, 14 ఏళ్ల ప్రాచి, 12 ఏళ్ల పఖి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. అన్ని పనులు కలిసే చేసేవారు. కోవిడ్ సమయంలో ముగ్గురు అక్కాచెల్లెళ్లు టాస్క్ బేస్డ్ కొరియన్ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలుగా మారారు. గంటలు, గంటలు గేమ్ ఆడుతూ గడిపేవారు. అంతేకాదు.. తమ పేర్లు మార్చుకుని కొరియన్ పేర్లు పెట్టుకున్నారు. గేమ్ అడిక్షన్ కారణంగా స్కూలుకు కూడా సరిగా వెళ్లేవారు కాదు. పిల్లలు పూర్తిగా గేమ్‌కు బానిసలుగా మారటంతో తల్లిదండ్రులకు కోపం వచ్చింది. వారిని ఇకపై గేమ్ ఆడవద్దని మందలించారు. దీంతో ముగ్గురూ మనస్తాపానికి గురయ్యారు. గేమ్ ఆడకుండా బతకలేమని భావించారు. ఈ నేపథ్యంలోనే ముగ్గురూ కలిసి చనిపోవాలని నిశ్చయించుకున్నారు. మంగళవారం 8 పేజీల సూసైడ్ నోట్ రాశారు. రాత్రి 2.30 గంటల ప్రాంతంలో 9వ అంతస్తులో ఉన్న తమ ఎ÷-లాట్ కిటికీ నుంచి ఒకరి తర్వాత ఒకరు కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నారు. బిల్డింగ్ దగ్గర పెద్ద శబ్దం రావటంతో స్థానికులు అక్కడికి వచ్చారు. నేలపై రక్తపు మడుగులో పడి ఉన్న వారిని చూసి షాక్ అయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ముగ్గురిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వారు చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మాస్ సూసైడ్స్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్కాచె÷-లలెళ్ల గదిలోకి వెళ్లి పరిశీలించగా అక్కడ సూసైడ్ నోట్ దొరికింది. ఆ సూసైడ్ నోట్‌లో వారు తమ బాధనంతా వివరంగా రాసుకొచ్చారు. తల్లిదండ్రులకు క్షమాపణ సైతం చెప్పారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ఏం తేలిదంటే.. ప్రాచీ విపరీతంగా మొబైల్ ఫోన్ వాడేది. ఆమె కారణంగానే మిగిలిన ఇద్దరూ ఆన్‌లైన్ గేమ్ 'కొరియన్ లవర్'కు బానిసలుగా మారారు. చివరకు గేమ్ అడిక్షన్ కారణంగానే ముగ్గురూ ప్రాణాలు కోల్పోయారు.

## పులి జాడలతో జనం బెంబేలు

**అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన**

**జనగామ,ఫిబ్రవరి:**

పెద్దపులి సంచారం ఇప్పుడు మూడు జిల్లాల వాసులను భయాందోళనకు గురి చేస్తోంది. సిద్దిపేట, యాదాద్రి, జనగామ జిల్లాల సరిహద్దుల్లో తిరుగుతున్నట్లుగా గుర్తించారు. జనగామ మండలంలోని సిద్దెంకి, పెంబర్తి, పెద్దరాంచర్లలో పెద్దపులి సంచరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. యాద్రాది భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామ మీదుగా పెద్దపులి జనగామకు ప్రవేశించినట్లు రైతులు ఆటవీశాఖ, పోలీసులు సమాచారం అందించారు. దీంతో అధికారులు ఆయా గ్రామాలకు వెళ్లి పులి పాదముద్రలను సేకరించారు. వ్యవసాయ బావుల ప్రాంతాల్లో సంచరిస్తూ ఉండోచ్చని కావున వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన పెద్దపులి వరుస గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. తాజాగా ఈ పులి యాదాద్రి భువనగిరి(జజీటజీటసతి ఃఠబీలజీనిజీణతిసతి) జిల్లా రాజపేట మండలం బసంతపూర్ సమీపంలో ఓ లేగదూడపై దాడి చేసి చంపేసినట్లు అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు, తాజాగా జనగామ జిల్లా ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామ పరిసరాల వైపు పులి వెళ్లినట్లు పాదముద్రల ఆధారంగా గుర్తించారు. ఘటనా స్థలాల్లో అటవీ శాఖ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. పులి ప్రయాణించే మార్గాల్లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పులి సంచారం కారణంగా సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## మోహన్‌బాబు వర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య

**సమగ్ర విచారణకు సిఐటియు డిమాండ్**

తిరుపతి,ఫిబ్రవరి:

సినీనటుడు మోహన్ బాబు యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి బాలాజీ ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు నేతలు రుయా ఆసుపత్రికి వెళ్లి విద్యార్థి యువ నాయకులను పరామర్శించారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మురళి మాట్లాడుతూ గత కొంతకాలంగా విద్యార్థులు, తల్లిదండ్రుల పట్ల యూనివర్సిటీ యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో. ఓ విద్యార్థి మరణం పలు అనుమానాలను కలిగిస్తోందని అన్నారు. పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపి నిజా నిజాలు వెల్లడి చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులకు కడుపు శోకాన్ని మిగల్చకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కందారపు మురళి ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఓటమి భయంతోనే కాంగ్రెస్ దౌర్జన్యకాండ

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా, ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజాసమస్యలపై బీఆర్ఎస్ పోరాటం ఆపబోమని స్పష్టంచేశారు.

## మెట్రోపాలిటన్‌లో అందరికీ సమాన పౌరసేవలు

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

మహానగరంలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగ్గా తీర్చిదిద్దాల్సిన అవసరముంది. బస్తీలు, మురికివాడల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఏవిధంగా ముందుకు వెళ్లాలి.. ఎలాంటి అభివృద్ధి ప్రణాళికలు చేయాలన్న విషయమై నిర్ణయాలు తీసుకుంటాం.

నగరంలో చెరువులపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే వాటిని కబ్జాల నుంచి కాపాడేందుకు హైడ్రాను ఏర్పాటు చేశాం. అయితే చెరువులను కాపాడమే కాదు.. అందులో కాలుష్య రహిత జలాలు ఉండేలా చూస్తాం. దగ్గర్లోని కాలనీలు, బస్తీలను ఆయా చెరువులకు అనుసంధానం చేస్తాం. అక్కడ పర్యాటకం, ఆహ్లాదకరమైన వాతావరణానికి తగిన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం.

నగరంలో పారిశుద్ధ్య పనులకు ఇది కీలకమైన సమయం. ఎండాకాలంలో కాలువల్లో పూడిక తీత పనులు చేయాల్సి ఉంది. ఆయా పనులు నాణ్యంగా నిర్వహించడంతో పాటు రానున్న వర్షాకాలాన్ని ఎదుర్కొనేలా ప్రణాళిక చేయనున్నాం.

ట్రాఫిక్ పెద్ద సమస్యగా మారుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు పోలీసులు, రవాణాశాఖ అధికారుల సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ట్రాఫిక్ సమస్య వేగంగా పరిష్కరించడం ద్వారా బెంగళూరు లాంటి ట్రాఫిక్ సంక్షోభంతలెత్తకుండా వ్యూహంతో ముందుకు వెళ్తాం.

జీహెచ్‌ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లు మెట్రోపాలిటన్ ప్రాంతంలో భాగం. ఈ మూడింటికి మొబిలిటీ ప్లాన్ అంతర్గతంగా ఉంటుంది. దీన్ని సమగ్రంగా రూపొందిస్తాం.

## బ్రిటిష్ పార్లమెంట్‌లో తెలంగాణ బిడ్డ

**హైదరాబాద్:**

శతాబ్దాల చరిత్ర ఉన్న బ్రిటిష్ పార్లమెంట్ ఎగువసభ 'హౌస్ ఆఫ్ లార్డ్స్'లో తెలంగాణ బిడ్డ ఉదయ్ నాగరాజు జీవితకాల సభ్యుడి (లైఫ్ పీర్)గా ప్రమాణ స్వీకారంచేశారు. బ్రిటిష్ సంప్రదాయాల మేరకు బుధవారం జరిగిన వేడుకలో ముదురు ఎరుపు రంగు గౌను ధరించి, భగవద్గీతపై నాగరాజు ప్రమాణం చేశారు. మూలాలను మరవకుండా భారతీయ సంస్కృతిపై తన గౌరవాన్ని చాటారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన ఉదయ్ నాగరాజు.. దాదాపు 25 ఏళ్ల క్రితం బ్రిటన్ వెళ్లారు. మహాత్మాగాంధీ ఫ్యూచర్ లీడర్స్ ప్రోగామ్ వ్యవస్థాపకుడిగా యువతలో నైతిక నాయకత్వం, సామాజిక న్యాయం, గాంధేయ విలువలను పెంపొందించడంలో కృషిచేస్తున్నారు. 'ఏఐ పాలసీ ల్యాబ్స్' సంస్థను స్థాపించి కృత్రిమ మేధ (ఏఐ), గ్లోబల్ గవర్నెన్స్‌పై విశేష కృషి చేస్తున్నారు. రెండేళ్ల క్రితం అక్కడి పార్లమెంట్ ఎన్నికల్లో నార్త్ బెడ్‌ఫోర్డ్‌షైర్ నియోజకవర్గం నుంచి లేబర్ పార్టీ తరఫున పోటీ చేసి స్వల్ప తేడాతో రెండో స్థానంలో నిలిచారు. అయినా ఆయన సేవలకు గుర్తింపుగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సిఫార్సు మేరకు కింగ్ చార్లెస్-3.. ఎగువ సభ సభ్యునిగా ఎంపిక చేశారు. ఇకపై ఆయనను 'లార్డ్ నాగరాజు ఆఫ్ బ్లూమ్స్‌బరీ' పేరుతో పిలుస్తారు. తన పేరు ముందు 'బ్లూమ్స్‌బరీ' చేరడం వెనక బలమైన కారణం ఉంది. ఆయన ఉన్నత విద్యను అభ్యసించిన ప్రఖ్యాత 'యూనివర్సిటీ కాలేజీ లండన్' ఈ ప్రాంతంలోనే ఉంది. గాంధీ చదివిన ఈ కళాశాలలోనే ఆయన పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు.

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు

**ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము**

**కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారంనాడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రాజ్యాంగంలోని 356వ అధికరణలోని క్లాజ్ (2) ద్వారా తనకు సంక్రమించిన అధికారాలతో 2025 ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తున్నట్టు రాష్ట్రపతి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరి 4వ తేదీ నుంచి తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపారు. జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడకడంతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ గతేడాది రాజీనామా చేశారు. దీంతో తొలుత 6 నెలలపాటు అక్కడ రాష్ట్రపతి పాలన విధించి మరోసారి దానిని పొడిగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కేంద్రం చేపట్టిన సన్నాహకాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాసనసభా పక్ష నేతగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 62 ఏళ్ల ఖేమ్‌చంద్ మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మణిపూర్ రాజకీయాల్లో బీజేపీ కీలక నేతగా ఖేమ్‌చంద్ పేరు తెచ్చుకున్నారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంఫాల్ వెస్ట్‌లోని సింజమి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017 మార్చి నుంచి 2022 మార్చి వరకూ మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడంతో బీరేన్ సింగ్ ప్రభుత్వంలో రెండోసారి క్యాబినెట్ మంత్రిగా సింగ్ నియమితులయ్యారు. మున్సిపల్ పాలనా వ్యవహారాలు, హౌసింగ్ డెవలప్‌మెంట్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యా శాఖలను నిర్వహించారు. 2025 ఫిబ్రవరిలో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేంత వరకూ ఆ పదవులను ఆయన సమర్థవంతంగా నిర్వహించారు.

## మరో బీహార్‌లా మారుతున్న ఎపి

### రూల్ ఆఫ్ లా హైజాక్ అయ్యింది

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విజయవాడ,ఫిబ్రవరి

ఎపి మరో బీహార్ లా మారుతోంది.. రూల్ ఆఫ్ లా హైజాక్ అయ్యింది ' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం విజయవాడ ఎంబివికె లో నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా హైజాక్ అయ్యిందని అన్నారు. నిన్నటి రోజున తిరుపతి యూనివర్సిటీలో జరిగిన ఘటన అత్యంత దారుణమన్నారు. విద్యార్థి నాయకులపై దౌర్జన్యం చేసి కొట్టి హింసించారని? పోలీసులు చొరవ తీసుకొని ఉండకపోతే వారిని చంపేసి ఉండేవారని ఆరోపించారు. ఇలాంటి అరాచక పరిపాలన రాష్ట్రంలో ఇంతకుముందెన్నడూ లేదు అని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మరో బీహార్ లాగా మారిపోతుందన్నారు. రూల్ ఆఫ్ లా అనేది స్థాపించకపోతే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉండవు అని అన్నారు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. మోహన్ బాబు యూనివర్సిటీ ఓ సేవా సంస్థ కింద రిజిస్టరయ్యి ఉందని, కానీ కోట్ల రూపాయలను విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. యూనివర్సిటీలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తున్న విద్యార్థి నాయకులపై దౌర్జన్యం చేయడమేంటి ? అని ప్రశ్నించారు. ' మీ చేతుల్లోనే ఉందా చట్టం.. మీదేనా రాజ్యం ' అని ధ్వజమెత్తారు. బౌన్సర్లను యూనివర్సిటీలోనికి ఎలా అనుమతిస్తారు ? అని నిలదీశారు. మోహన్ బాబు జీవితంలో విలన్ లాగ ప్రవర్తిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోబోరని, తగిన బుద్ధి చెబుతారని వి.శ్రీనివాసరావు హెచ్చరించారు.

## భారీ కాన్వాయ్‌తో మాజీ సిఎం జగన్ రాక

### గుంటూరు రోడ్డుపై కిలోమీర్ల మేర ట్రాఫిక్ జామ్

గుంటూరు,ఫిబ్రవరి

మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించేందుకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి నుంచి గుంటూరుకు బయలుదేరి వెళ్లారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి మంది మార్బలంతో గుంటూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో గుంటూరు - విజయవాడ రహదారిపై సుమారు 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో కనీసం అంబులెన్స్‌లకు కూడా దారి లేకుండా పోయింది. ట్రాఫిక్ భారీగా స్తంభించడంతో వాహనదారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి. ట్రాఫిక్ ఇబ్బందులపై అయితే గతంలో పల్నాడు, నెల్లూరు జిల్లాల్లో జగన్ పర్యటనల సందర్భంగా జరిగిన పరిణామాల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలో పోలీసు ఆంక్షలు విధించారు. ఎడ్లపాడు జాతీయ రహదారిపై వైసీపీ నేతల వాహనాలను పోలీసులు నిలిపివేస్తున్నారు. గుంటూరులో జగన్ పర్యటనకు వెళ్లకుండా ఆంక్షలు పెట్టి, పలువురు వైసీపీ నేతలకు నోటీసులు ఇచ్చారు. మరోవైపు పల్నాడు జిల్లా నుంచి గుంటూరుకు వైసీపీ కేడర్ తరలివెళ్తోంది. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు దగ్గర తనిఖీలు నిర్వహించి ఎక్కడికక్కడ వైసీపీ నేతలను పోలీసులు అడ్డుకుంటున్నారు. మరోవైపు.. జగన్ గుంటూరు పర్యటనకు అనుమతి ఇవ్వాలని వైసీపీ నాయకులు పోలీసు అధికారులను కోరారు. అందుకు పోలీసులు నిరాకరించారు. గుంటూరు జిల్లా పరిధిలో పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎక్కడా బహిరంగ సభలు, సమావేశాలకు అనుమతి లేదని జిల్లా పోలీసు యంత్రాంగం ప్రకటన జారీ చేసింది.

# తెలంగాణలో ఏజెన్సీ డీఎస్సీ ఎయ్యారా సారో!

**ఏ ఎం న్యూస్ ఓయూ:**
తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అంటూ వేదిక ఏదైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే గుర్తు చేస్తుంటారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలు అంటే ఆదివాసులు నివసించే అటవీ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి అత్యంత ప్రాముఖ్యమైనది. ఈ ప్రాంతాల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. అందువల్ల ప్రభుత్వం తక్షణమే ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణ స్వరాష్ట్రం సాధించుకున్న తర్వాత 2018 సంవత్సరంలో ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ తర్వాత 2024 మెగా డీఎస్సీ పేరుతో టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. మొత్తం ఉపాధ్యాయ ఖాళీల సంఖ్య 11,062 ఉండగా దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 2,79, 956 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఒక్క పోస్ట్ కు 26 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. 6 సెప్టెంబరు 2023 నాటికి ఏజెన్సీ ప్రాంతంలో 5089 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ ని పక్కన పెట్టిన పాలకులు 22 ఏప్రిల్ 2020 సంవత్సరం సుప్రీంకోర్టులో జీవో నెంబర్ 3 ను కొట్టి వేయబడిందని సాకు చెబుతూ అర్హులైన స్థానిక ఆదివాసీ నిరుద్యోగ యువతకు దక్కవలసిన ఉపాధ్యాయ ఉద్యోగాలు గిరిజనేతర్లతో భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో భర్తీ చేయవలసిన 5,089 ఉపాధ్యాయ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. అర్హత కలిగిన స్థానిక ఆదివాసి నిరుద్యోగ యువత ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తుంది.

**ఉపాధ్యాయుల కొరత -- ప్రధాన సమస్య**
ఏజెన్సీ ప్రాంతంలోని ప్రైమరీ పాఠశాలలు ట్రైబల్ వెల్ఫేర్ ఆధ్వ ర్యంలో కొనసాగుతున్న స్కూల్స్ సంఖ్య 2,311 ఉండగా ట్రైబల్ రెసిడెన్షియల్, ఆర్ఎస్,ఆర్ జె సి, జీఎం స్కూల్స్ మొత్తం 165 ఉన్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో అనేక పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో నడుస్తు న్నాయి. కొన్నిచోట్ల ఒకే ఉపాధ్యాయుడు అన్ని తరగతు లకు బోధిస్తున్న పరిస్థితి ఉంది. ఇది విద్యా ప్రమాణాలను తగ్గి స్తోంది. విద్యార్థులు సరైన మార్గదర్శకత్వం పొందలేక పోతు న్నారు. ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ ద్వారా అర్హత కలిగిన స్థానిక ఆదివాసి అభ్యర్థులను నియమిస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.



**ఆదివాసి విద్యార్థుల అభివృద్ధి..**
ఆదివాసి ప్రాంతాల్లో విద్యార్థులు భాషా సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, రవాణా సౌకర్యాల లోపం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. స్థానిక భాష, సంస్కృతి తెలిసిన ఉపా ధ్యాయులు ఉంటే విద్యార్థులకు బోధన సులభంగా అర్థమవు తుంది. దీంతో చదువు మానివేతలు తగ్గి, ఉన్నత విద్యకు అవకాశాలు పెరుగుతాయి. బీఈడీ, టిటిసి పూర్తిచేసిన స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ద్వారా ఆదివాసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఇది వారి ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే కాకుండా, ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడుతుంది. స్థానికులు ఉద్యోగాలు పొందితే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వేగవంతమవుతుంది.

**ప్రభుత్వ బాధ్యత**
రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకోవాలి. రాజ్యాంగం కూడా ఆదివాసి ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక రక్షణ కల్పించింది. అందువల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను గుర్తించి, ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలి ఆదివాసి నిరుద్యోగ యువత కోరుతున్నారు. మన పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఆదివాసి ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం సుప్రీంకోర్టు కొట్టి వేసిన జీవో నెంబర్ 3 ను పునరుద్ధరించి ఏజెన్సీ ప్రాంతాలలోని ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి ప్రత్యేక ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ జారీ చేసి నిరుద్యోగ ఆదివాసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.
మొత్తానికి ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ అత్యవసరం. ఇది ఆదివాసి విద్యార్థుల భవిష్యత్తును ప్రకాశవంతం చేయడమే కాకుండా, ఆదివాసి సమాజ అభివృద్ధికి బాటలు వేస్తుంది. ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ రాజ్యం తక్షణ చర్యలు తీసుకుని ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అర్హులైన ఆదివాసి నిరుద్యోగ యువత ఆశిస్తున్నారు.

### కెపిహెచ్బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న
## వ్యాపార సముదాయ యజమానులతో కేపీహెచ్బీ పోలీసుల సమావేశం



**ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :**
కెపిహెచ్బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న షాపులు, వ్యాపార సముదాయాల యజమానులతో కేపీహెచ్ బీ పోలీసులు హౌసింగ్ బోర్డ్ కమ్యూనిటీ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేపీహెచ్బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వ్యాపారులు చట్టబద్ధమైన నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. షాపులు, వ్యాపార సముదాయాల యజమానులు తప్పనిసరిగా జీహెచ్ఎంసీ అనుమతి, ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ నమోదు, లేబర్ లైసెన్స్, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అనుమతించిన వేళల్లోనే వ్యాపారాలను నిర్వహించుకోవాలన్నారు. సమయపరిమితులు పాటించాలన్నారు. దుకాణాల వద్ద అక్రమ కార్యకలాపాలు, జూదానికి పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా భద్రత దృష్ట్యా ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలను కవర్ చేసేలా సీసీటీవీ కెమెరాలను స్వయంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యాపార అవసరాల కోసం ఫుట్‌పాత్‌లు, రహదారులను ఇష్టానుసారంగా ఆక్రమించరాదన్నారు. నిబంధనలు పాటించని షాపుల లైసెన్సుల రద్దుకు సంబంధిత శాఖలకు లేఖలు రాస్తామని ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది, కేపీహెచ్బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుకాణాలు, వ్యాపార సముదాయ యజమానులు పాల్గొన్నారు.

# పురపోరులో కాంగ్రెస్ గుండాగిరి..

**ముస్సిపోల్స్‌లో అధికార పార్టీ దౌర్జన్యకాండ**
**ముస్సిపోల్స్‌లో అధికార పార్టీ దౌర్జన్యకాండ**
**కాంగ్రెస్ నేతల అరాచకాలతో ఉద్రిక్త పరిస్థితులు**
**పలు జిల్లాల్లో రణరంగంగా పోలింగ్ కేంద్రాలు**
**ప్రలోభాలు, బెదిరింపుల నడుమ పోలింగ్**
**నల్లగొండలో కాంగ్రెస్ దొంగ ఓట్లు వేయిస్తున్నదని ఫిర్యాదు చేసినందుకు బీఆర్ఎస్ నేతల అరెస్ట్**
**కరీంనగర్‌లో దొంగఓట్లపై నిలదీసినందుకు బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసుల లాఠీచార్జ్**
**కొత్తగూడెంలో కండువాతో పోలింగ్ కేంద్రంలోకి రావద్దన్న కానిస్టేబుల్‌పై కాంగ్రెస్ అభ్యర్థి వీరంగం**
**కామారెడ్డిలో కొట్లాట.. నలుగురికి గాయాలు**
**మంచిర్యాలలో దర్జాగా కాంగ్రెస్ నగదు పంపిణీ**
**పోలింగ్ ప్రశాంతం: రాష్ట్ర ఎన్నికల కమిషన్**



హైదరాబాద్, ఫిబ్రవరి 11 :
పురపోరులో అధికార పార్టీ మూకలు దౌర్జన్యానికి తెగబడ్డాయి. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పండుగలా జరుగాల్సిన మున్సిపల్ ఎన్నికల్లో.. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సృష్టించిన అరాచకాలతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దొంగ ఓట్లు, నగదు పంపిణీ, దాడులు, లాఠీచార్జ్‌లతో పలు జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు రణరంగంగా మారాయి. అధికార అండతో కొందరు పోలీసులు, కాంగ్రెస్ శక్తులు అడ్డూఅదుపు లేకుండా వ్యవహరించాయి. యథేచ్ఛగా, బహిరంగంగానే డబ్బు లు పంచి ఓటర్లను ప్రలోభపెట్టాయి. ఇంత జరుగుతున్నా పోలీసు యంత్రాంగం వారికే వత్తాసు పలికిందంటూ విపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. పోలింగ్ సందర్భంగా టీపీసీసీ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి రెచ్చిపోయి పోలీసులు, అధికారులను తిట్టి, బెదిరించడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. చివరకు ఎన్నికల సంఘం జోక్యం చేసుకొని ఆయనపై కేసు నమోదు చేయాలని ఎస్పీని ఆదేశించింది.
పోలింగ్ రోజున హస్తం నేతలు, అభ్యర్థులు ఎన్ని అరాచకాలు సృష్టించారో చెప్పేందుకు జగ్గారెడ్డి ఘటనే నిదర్శనం అని విపక్షాలు భగ్గుమంటున్నాయి. మెదక్ జిల్లా సంగారెడ్డిలో 34వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద హైడ్రామా నడిచింది. టీపీసీసీ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఏకంగా పోలింగ్ బూత్‌లోకి దూసుకెళ్లడం ఉద్రిక్తతకు దారితీసింది. పోలింగ్ ఆపేస్తానంటూ ఆయన చేసిన బెదిరింపులు, అకడి అధికారులు, పోలీసులపై ఆయన వాడిన భాష తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఘటన మీడియాలో ప్రముఖంగా రావడంతో జగ్గారెడ్డిపై కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్పీని ఎస్ఈసీ ఆదేశించింది. అటు నర్సాపూర్‌లోనూ 15వ వార్డులో బీఆర్ఎస్ నాయకులపై బీజేపీ శ్రేణులు దాడులకు దిగడంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి జనాన్ని చెదరగొట్టాల్సి వచ్చింది.
నల్లగొండలో కాంగ్రెస్ హల్‌చల్
నల్లగొండ జిల్లాలో అధికార పార్టీ నేతలు బరితెగించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. నల్లగొండ 32వ డివిజన్‌లో దొంగ ఓట్లపై ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నేతలనే పోలీసులు అరెస్టు చేయడం గమనార్హం. దీంతో పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత నెలకొన్నది. 30వ డివిజన్ పోలింగ్ బూత్‌లో దొంగ ఓట్లు కలకలం రేపాయి. అడ్డుకొన్న బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నేతలు దౌర్జన్యానికి దిగారు. చిట్యాల మున్సిపాలిటీలో 'కాంగ్రెస్ వాళ్లు 4వేలు ఇస్తే, మీరు 5 వేలు ఇచ్చుకోండి' అని ఓ ఎస్సై బహిరంగంగానే వ్యాఖ్యానించడం పోలీసుల పక్షపాత వైఖరికి నిదర్శనమని బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. దేవరకొండ ము న్సిపాలిటీ 16వ వార్డులో కాంగ్రెస్ శ్రేణులు బీఆర్ఎస్ నాయకులపై దౌర్జన్యానికి దిగాయి.
కామారెడ్డిలో ఎమ్మెల్యేల ప్రత్యక్ష జోక్యం
కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు స్వయంగా పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లి ఓటర్లను ప్రలోభపెట్టినట్టు ఆరోపణలు వచ్చాయి. బాన్సువాడలో ఏకంగా ఒక కానిస్టేబుల్ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ప్రచారం చేయడం గమనార్హం. నిజామాబాద్ 19వ డివిజన్‌లో బీజేపీ-కాంగ్రెస్ నేతల మధ్య ఘర్షణ జరిగింది.
హుజూరాబాద్‌లో ఆన్‌లైన్‌లో బ్యాలెట్ పేపర్
కరీంనగర్‌లో జిల్లా హుజూరాబాద్ మున్సిపాలిటీ 2వ వార్డులో ఓటు వేసిన బ్యాలెట్ పేపర్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడం కలకలం రేపింది. ఈసీ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినప్పటికీ సెల్‌ఫోన్ పోలింగ్ స్టేషన్‌లోకి ఎలా వెళ్లిందనేది చర్చనీయాంశమైంది.
మంచిర్యాలలో దర్జాగా నగదు పంపిణీ
మంచిర్యాల (చెన్నూరు)లో మంత్రి వివేక్ బైక్‌పై తిరుగుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేశారని మాజీ ఎమ్మెల్యే బాల సుమన్ అంబేదర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ 2వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి పెద్దింటి పద్మ భర్త శ్రీనివాస్ ఓటర్లకు డబ్బులు పంచగా కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశా రు. దీంతో ఆ వార్డు ఎన్నిక రద్దు చేయాలని బీఆర్ఎస్ సహా స్వతంత్ర అభ్యర్థి మద్దతుదారులు పోలింగ్ కేంద్రం ఎదుట ధర్నా చేశారు.
కరీంనగర్‌లో లాఠీచార్జ్
మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కరీంనగర్‌లో బుధవారం స్వల్ప లాఠీచార్జ్ జరిగింది. కరీంనగర్ కార్పొరేషన్ 58వ డివిజన్‌లోని జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌కు ఓ మహిళ ఓటు వేయడానికి రాగా, ఆమె ఓటు అప్పటికే వినియోగించినట్టు ఉన్నదని పోలింగ్ సిబ్బంది తెలిపారు. దీంతో ఆ మహిళ బయటకు వచ్చి చెప్పుకోగా, అక్కడే ఉన్న బీజేపీ నాయకులు కొందరు లొల్లిచేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ వర్గాల మధ్య జరిగిన వాగ్వాదం కాస్త గొడవకు దారితీసింది. విషయం తెలుసుకున్న సీపీ గౌస్ ఆలం అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టేందుకు లాఠీచార్జ్ చేయించారు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తలు రోడ్లపై పరుగులు తీశారు. పలువురికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ సందర్భంగా 58వ డివిజన్ బీఆర్ఎస్ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు.
కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగులపై కేసు
కరీంనగర్‌లోని 28వ డివిజన్‌లో కాంగ్రెస్ అభ్యర్థితోపాటు ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఓటర్లను ప్రలోభ పెడుతున్నట్టు తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు అక్కడికి వెళ్లి ఆందోళనకు దిగారు. దీంతో బీఆర్ఎస్ నాయ కులను పోలీసులు బలవంతంగా తమ వాహ నం ఎక్కించారు. విషయం తెలుసుకున్న ఎ మ్మెల్యే గంగుల కమలాకర్ అక్కడికి వెళ్లి పోలీసులపై మండిపడ్డారు. ఓ కార్యకర్తను పోలీస్ వాహనం నుంచి దింపినందుకు ఎమ్మెల్యే గంగుల, బీఆర్ఎస్ అభ్యర్థి కుర్ర తిరుపతితో పా టు మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు.
అరాచక ఘటనలు..
మహబూబాబాద్ మున్సిపాలిటీ 14వ వార్డులో పోలింగ్ కేంద్రం వద్ద ప్రచారం చేసిన కాంగ్రెస్ అభ్యర్థి నాగేశ్వరరావును బీఆర్ఎస్ నేతలు అడ్డుకొన్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది.
కరీంనగర్ కార్పొరేషన్ 58వ డివిజన్‌లో దొంగ ఓట్లపై ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసుల లాఠీచార్జ్ చేశారు.
కరీంనగర్‌లో ఓటు వేసేందుకు వెళ్లొద్దని సిబ్బందిపై కరీంనగర్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు హుకుం జారీ చేసినట్టు ఆరోపణలు వచ్చాయి.
నాగర్‌కర్నూల్ 15వ వార్డులో దొంగ ఓట్లు వేయిస్తూ కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ నేతలకు దొరికారు.
నాగర్‌కర్నూల్ 12వ వార్డులో కాంగ్రెస్ నేతలు డబ్బులు పంపిణీ చేస్తుండగా బీఆర్ఎస్ నేతలు పట్టుకున్నారు.
కొల్లాపూర్ మున్సిపాలిటీ 1వ వార్డులో డబ్బులు, కాంగ్రెస్ కరపత్రాలను పంచుతూ ఓటర్లను ప్రలోభాలకుగురిచేశారు.
నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో 7, 8, 13, 14, 16 వార్డుల పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు.
భద్రాద్రి కొత్తగూడెంలో పార్టీ కండువాతో పోలింగ్ కేంద్రం లోపలికి రావద్దన్న కానిస్టేబుల్‌ను కాంగ్రెస్ అభ్యర్థి హరిహరన్ బెదిరించాడు.
మంచిర్యాలలో దర్జాగా నగదు పంపిణీ
మంచిర్యాల (చెన్నూరు)లో మంత్రి వివేక్ బైక్‌పై తిరుగుతూ నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం చేశారని మాజీ ఎమ్మెల్యే బాల సుమన్ అంబేదర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్ 2వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి పెద్దింటి పద్మ భర్త శ్రీనివాస్ ఓటర్లకు డబ్బులు పంచగా కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఆ వార్డు ఎన్నిక రద్దు చేయాలని బీఆర్ఎస్ సహా స్వతంత్ర అభ్యర్థి మద్దతుదారులు పోలింగ్ కేంద్రం ఎదుట ధర్నా చేశారు. అధికార బలంతో కాంగ్రెస్ శ్రేణులు చేసిన ఆగడాలు, పోలీసుల అత్యుత్సాహం ప్రజాస్వామ్య స్ఫూర్తిని కించపరిచేలా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
నకిలీ ఓటర్లను అడ్డుకున్నందుకు అరెస్ట్
నల్లగొండ 32వ డివిజన్ పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు వేరే ప్రాంత వ్యక్తులతో నకిలీ ఓట్లు వేయిస్తుండగా అడ్డుకున్న బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు అరెస్ట్ చేసినందుకు నిరసన తెలుపుతూ నల్లగొండ ప్రగతి స్కూల్ వద్ద రాస్తారోకో చేసున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, నాయకులు



## బడుగు బలహీన వర్గాలకు ఉండే ప్రాంతాల్లో నిర్లక్ష్యం..: కుమార్ షాను

**ఏ ఎం న్యూస్ ఓయూ:**



లాలాపేట్ ఆర్య నగర్ లో గత తొమ్మిది సంవత్సరాలుగా కొనసాగుతున్న కమ్యూనిటీగా నిర్మాణం గత ఐదు సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్న సీసీ రోడ్లో రైల్వే ట్రాక్ పక్కన ఆర్య నగర్ మెయిన్ రోడ్డు వైపు గత పది ఐదు సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్న వేరేజ్ డ్రైనేజ్ రిపేర్ చేస్తున్నాడు తప్ప కొత్త లైన్ శాంక్షన్ చేయడం లేదు ఆర్య నగర్ లో నివసిస్తున్న పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాలు కాబట్టి అధికారులు ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

## నేడు కెపిహెచ్బి కాలనీ ఐదో ఫేస్‌లో జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పుట్టినరోజు వేడుకలు...

**ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :**



కూకట్పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పుట్టినరోజు సందర్భంగా గురువారం ఉదయం 9 గంటలకు కెపిహెచ్బి కాలనీ 5వ ఫేస్ జనసేన పార్టీ ఆఫీస్ వద్ద ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, శ్రేయోభిలాషులు పాల్గొనవలసిందిగా కోరుతున్నామని వారు తెలియజేశారు.

### చేవెళ్ల మున్సిపాలిటీలో
## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన వడ్డేపల్లి

**ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :**
చేవెళ్ల మున్సిపాలిటీలో పోలింగ్ జరుగుతున్న సందర్భంగా చేవెళ్ల మున్సిపాలిటీ బీజేపీ ఎన్నికల ఇంచార్జ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు పూర్తిగా స్వేచ్ఛాయుతంగా, న్యాయంగా, శాంతియుత వాతావరణంలో జరగాలని అధికారులను కోరారు. అలాగే బీజేపీ పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, పోలింగ్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



## బడ్జెట్ కసరత్తులో ఆర్థిక మంత్రి పయ్యావులు

**వివిధ శాఖల అధికారులతో ప్రీ-బడ్జెట్ సమాలోచనలు**
**ఐదుశాఖలకు చెందిన మంత్రులతో రసు భేటీలు**
**14న బడ్జెట్ సమర్పణకు ముమ్మరంగా కసరత్తు**

**అమరావతి,ఫిబ్రవరి**
ఈనెల 14వ తేదీన 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్‌ను మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నేతృత్వంలో ఆ శాఖ అధికారులు ఈ పక్రియను వేగవంతం చేశారు. బడ్జెట్ కసరత్తులో భాగంగా ఆర్థిక మంత్రి వరుసగా ప్రీ-బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఐదు శాఖలకు చెందిన మంత్రులతో సమావేశాలు పూర్తయ్యాయి. మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవి కుమార్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, అనితలతో వరుస సమావేశాలు జరిపారు. ఈ సమావేశాల్లో ఆయా శాఖలకు నిధుల కేటాయింపులు, ప్రాధాన్యతలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. వివిధ శాఖల మంత్రులు తమ ప్రతిపాదనలను ఆర్థిక మంత్రికి సమర్పించారు. సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో నిధులు కేటాయించేలా ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందిస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఉత్తరాంధ్ర-రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించేలా బ్జడెట్ కూర్పు సాగుతోంది. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపులకు ఎస్క్రో ఖాతాలు తెరుస్తామని స్పష్టం చేశారు. ఈ బ్జడెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు సమాచారం. తల్లికి వందనం, దీపం-2.0, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు వంటి పథకాలకు ప్రత్యేక నిధులు కేటాయించే అవకాశం ఉంది. వివిధ వర్గాలకు అందించే సంక్షేమ పథకాలకూ రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించనున్నట్లు తెలుస్తోంది. రోడ్ల అభివృద్ధిపైనా ఈ బ్జడెట్‌లో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పాత హోల్స్ రోడ్లు, కొత్త రోడ్ల నిర్మాణానికి ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. హార్టికల్చర్ రంగ అభివృద్ధికి ప్రత్యేక కేటాయింపులు, లాజిస్టిక్స్ సెక్టార్ వృద్ధిపై సర్కార్ ప్రత్యేక ఫోకస్ పెట్టనుంది. అంతేకాకుండా, జల్ జీవన్ మిషన్ పథకాన్ని వేగవంతం చేసేందుకు తగిన ప్రణాళికలు, నిధుల కేటాయింపులు జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే బ్జడెట్ కేటాయింపులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మంగళవారం (ఫిబ్రవరి 3) చర్చలు జరిపారు. అలాగే మిగిలిన శాఖల మంత్రులతోనూ త్వరలో సమావేశాలు జరిగే అవకాశం ఉంది.